ప్రజాశక్తి

సోమవారం 27 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బెట్టింగ్ బంగార్రాజులు



- రూ.వేలు, లక్షల్లో పందేలు
- ఎక్కడ చూసినా పార్టీల గెలుపోటములపైనే చర్చ
- విజయంపై ఎవరి ధీమా వారిది

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మరో వారం రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌ల పర్వం నడుస్తోంది. విజయావకాశాలపై అభ్యర్థులు, వారి అనుచరులు అంచనాలు వేసుకుంటున్నారు. విజయం తమదే అని కొంతమంది అభ్యర్థుల తరపున బెట్టింగ్‌లు కాస్తుండగా, మరికొందరు రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తుందంటే, తమపార్టీ వస్తుందని పోటాపోటీగా బెట్టింగ్‌లకు దిగుతున్నారు. హోరాహోరీ పోటీ నెలకొన్న నియోజకవర్గాల్లో బెట్టింగ్‌లు కాయడానికి ఏ పార్టీనూ సాహసించడం లేదు. కొన్ని చోట్ల వేల రూపాయలు బెట్టింగులు కాయగా, మరికొన్ని చోట్ల లక్షల వరకూ వెళ్తోంది. జూన్ 4 లెక్కింపు సమీపిస్తున్న కొద్దీ బెట్టింగ్‌ల వ్యవహారం మరింత జోరందుకొనేలా ఉంది. జిల్లాలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, యలమంచిలి, మాడుగుల సహా పెందుర్తి నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో బెట్టింగ్‌లు రహస్యంగా జరుగుతున్నాయి.

జిల్లాలో ఎక్కడ చూసినా, ఏ మూల కొద్దిమంది కూర్చొన్నా చర్చంతా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములపైనే సాగుతోంది. వైసిపి, టిడిపి - జనసేన - బిజెపి కూటమి అభ్యర్థుల విజయంపై బెట్టింగులు జరుగుతున్నాయి. అంచనాలకు దొరకని చోట బెట్టింగులకు దూరంగా ఉంటున్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి అయ్యన్నపాత్రుడు గెలుస్తారని ఆయన అనుచరులు, వైసిపి అభ్యర్థి ఉమా శంకర్ గణేష్ రెండోసారి గెలుస్తారని ఆయన అనుయాయులు భారీగా బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. లక్షల రూపాయలు బెట్టింగ్‌లు చేసినట్లు తెలుస్తోంది. జూన్ ఒకటి తరువాత బెట్టింగ్‌లు పెరగనున్నాయి. చెట్టుపల్లి, పెద్దబొడ్డేపల్లి, బలిఘట్టం, వేములపూడిలో టిడిపి నాయకులు రూ.50 వేలు, మిగతా 2లో..



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు, పోరాట కమిటీ నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను

ప్రైవేటుపరం కానివ్వం

1200వ రోజు దీక్షలో పోరాట కమిటీ నాయకులు

వార్త మెయిన్‌లో..

అలరించిన సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నట సార్వభౌముడు నందమూరి తారకరామారావు, సూపర్ స్టార్ కృష్ణ జయంతులు సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'దేవుడు చేసిన మనుషుల్లారా' శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆహూతులను అలరించింది. రమేష్ పట్నాయక్, సాత్విక, జోసెఫ్, సాహిణి, బొమ్మిడి సత్యనారాయణ, ఇందిరా సాహిణి, బాబ్జి, సుజాత, విశ్వ ప్రసాద్, కోమలి, ఎంవిఆర్.నాగేశ్వరరావు, భవాని పాడిన గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అంతకుముందు మిగతా 2లో..

రీడింగ్ రూమ్‌పై అంతులేని నిర్లక్ష్యం

వార్త 2లో..

గ్రంథాలయాల్లో విజ్ఞానదాయక పోటీలు

వార్త 7లో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వార్త 5లో..



సిపి పర్యవేక్షణలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్న పోలీసులు

మందుబాబులపై కొరడా !

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ ఎ.రవి శంకర్, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కె.ఫక్కీరప్పల ఆధ్వర్యంలో నగరంలో శనివారం రాత్రి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. జోన్ - 1, 2 పరిధిల్లో 75 బృందాలను ఏర్పాటు చేసి మందుబాబులపై కొరడా ఝులిపించారు. పలు ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించి 383 మంది వాహనదారులపై కేసులు నమోదు మిగతా 2లో..



కూల్.. కూల్

తీరం.. జన సంద్రం

వేడి, ఉక్కబోత నుంచి ఉపశమనానికి బీచ్‌కు పోటెత్తిన నగర వాసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆదివారం.. విశాఖ తీరం జనసంద్రమైంది. వేడి, ఉక్కబోతల నుంచి ఉపశమనం కోసం నగర జీవులు ఆర్‌కె బీచ్‌కు క్యూకట్టారు. పగటిపూట ఎలాగూ ఎండలు దంచికొడుతున్నందున కొద్ది రోజులుగా ప్రజలు ఉదయం 10 గంటల తరువాత పెద్దగా బయటకు రావడం లేదు. ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇక మధ్యాహ్నం 3 గంటల తరువాత బీచ్‌వైపునకు బయలుదేరుతున్నారు. అందునా సెలవు కావడంతో ఇంటిల్లిపాదీ కలిసి ఆదివారం బీచ్‌లో ఎంజాయ్ చేశారు. తీరంలో ఎక్కడ చూసినా జన సందడే కనిపించింది. వాహనాల రద్దీ నెలకొంది. రోడ్లపైనే కొందరు అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేశారు. కొద్ది రోజులుగా నగర పర్యటనకు వచ్చేవారి సంఖ్యా పెరుగుతూ వస్తోంది. వారి ఆగమనంతోనూ బీచ్ కిటకిటలాడుతోంది. మరోవైపు తీరాన్ని ఆనుకుని సాగుతున్న అన్ని వ్యాపారాలూ జోరందుకున్నాయి. ఐస్‌క్రీమ్‌లు, పల్లీలు, ఇతర తినుబండారాలు, శీతల పానీయాల అమ్మకాలు రెట్టింపయ్యాయి.

రీడింగ్ రూమ్‌పై అంతులేని నిర్లక్ష్యం

శిథిల దశలో భవనం

పాలకులకు, అధికారులకు పట్టని చారిత్రక సాహిత్య గ్రంథాలయం

కలెక్టర్ స్పందించాలని పలువురు విజ్ఞప్తి



శిథిల దశలో ఉన్న రీడింగ్ రూమ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హిందూ రీడింగ్ రూమ్.. విశాఖలో ఈ పేరు వినని వారుండరేమో..! అప్పట్లో ఇప్పటిలా ఎక్కడబడితే అక్కడ లైబ్రరీలుండేవికావు. సరిగ్గా వందేళ్ల క్రితం కొందరి సంకల్పం ఫలితంగా ఇది ఏర్పాటైంది. వన్‌టౌన్‌లోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో మెయిన్ రోడ్‌లో ఇది ఉంది. విశాఖలోని చారిత్రక సాహిత్య చరిత్రను తెలియజేసే అద్భుత గ్రంథాలయంగా చెప్పుకునే రీడింగ్ రూమ్ నేడు శిథిలావస్థకు చేరుకొని, దాదాపు రెండేళ్లుగా పూర్తిగా మూతపడింది. దీనిపై నిర్లక్ష్యం వహించిన పాలకులు, అధికారుల తీరుపై నేడు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హిందూ రీడింగ్ రూం గురించి తెలుసుకోవడమంటే 100 ఏళ్ల నాడు విశాఖలోని సాహితీ ప్రపంచం గురించి తెలుసుకోవడమే అవుతుంది. బ్రిటిష్ వారి హయాంలో 1836లో అప్పటి నగర ప్రముఖులు కొందరు జమీందారైన గోడె నారాయణ గజపతిరావు సహకారంతో ఓల్టు టౌన్‌లో హిందూ రీడింగ్ రూమ్‌ను స్థాపించారు. అక్కడ రోజూ పురాణ పఠనం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిపేవారు. అందులోనే ఒక లైబ్రరీని కూడా ఏర్పాటు చేశారు. సంస్కృతాంధ్ర భాషల్లో ఉన్న పురాణాలు, వేదాంత గ్రంథాలు, స్మృతులు, ఆనాటి కవుల కృతులు, హిందూ మత ఔన్నత్యాన్ని తెలిపే పలు ప్రాచీన గ్రంథాలను సమకూర్చారు. గోడె నారాయణ గజపతిరావు జీవించి ఉన్నంత వరకూ అంటే 1903 సంవత్సరం వరకూ దూర ప్రాంతాల నుంచి వచ్చే కవులను, పండితులను, పౌరాణికులను హిందూ రీడింగ్ రూమ్‌లోనే జమీందారు స్వయంగా సన్మానించేవారు. సభలు జరిపేవారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం తన స్వీయ చరిత్రలోను, తిరుపతి వేంకటకవులు నానా రాజ సందర్శనంలోనూ తమను గోడే జమీందారు సన్మానించినట్లు రాశారు. హిందూ రీడింగ్ రూమ్ ఉన్న భవనం శిథిలమై 1909 నాటికి పడిపోయే స్థితికి చేరుకుంది. అప్పుడు విక్రమ దేవ వర్మ, మారేపల్లి రామ చంద్రకవి, బొడ్డు రామయ్య మరికొందరు ప్రముఖులు గ్రంథాలయాన్ని రామచంద్రకవి ధర్మాశ్రమానికి తరలించారు. వారంతా గోడే నారాయణ గజపతిరావు పుత్రిక సీతాబాయి సహాయం అర్థించారు. ఆమె చిన్న వయసులోనే భర్తను కోల్పోయి విశాఖపట్నంలో పుట్టింటిలో ఉంటూ తండ్రి ఎస్టేట్ వ్యవహారాలు చూసేది. వారి అభ్యర్థన నేపథ్యంలో మహారాణి సీతాబాయి చాలా డబ్బు వెచ్చించి ఇప్పుడున్న హిందూ రీడింగ్ రూమ్ భవనాన్ని నిర్మించారు. అది 1917 నాటికి పూర్తయ్యింది. తన తండ్రి స్మృతి చిహ్నంగా 'మహారాజా సర్ జివిఎన్.గజపతిరావు హిందూ రీడింగ్ రూమ్' అనే పేరుతో వ్యవహరించాలని, భవనంలోని పై అంతస్తును రీడింగ్ రూమ్ ఉపయోగించాలని, కింది భాగాన్ని సామాజిక, సాంస్కృతిక, మతపరమైన సభలకు, సమావేశాలకు ట్రస్టు బోర్డు ఆమోదించిన కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించాలని, రాజకీయ సభలకు ఉపయోగించకూడదని నిర్దేశిస్తూ ఒక ట్రస్టు డీడ్ రాసి 1917 ఏప్రిల్ 13న రిజిస్టర్ చేయించారు. ఒక ట్రస్టు బోర్డును ఏర్పాటు చేసి హిందూ రీడింగ్ రూమ్ నిర్వహణ బాధ్యతలన్నీ ట్రస్టీలకు అప్పగించారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఆ ట్రస్ట్ బోర్డుకు చైర్మన్‌గా ఉంటారు. రీడింగ్ రూమ్ దైనందిన వ్యవహారాలు చూడటానికి మేనేజింగ్ కమిటీ ఒకటి ఉన్నప్పటికీ తుది నిర్ణయం ట్రస్టు బోర్డుదే. రీడింగ్ రూమ్‌ను 1917 ఫిబ్రవరి 24న ఆనాటి మద్రాసు గవర్నర్ ద రైట్ ఆనరబుల్ జాన్ బారన్ పెంట్లాండ్ దొర ఆవిష్కరించారు. ఆ తర్వాతే ట్రస్టు ఏర్పాటైంది. ఈ విధంగా హిందూ రీడింగ్ రూమ్ చరిత్రలో 1917 నుంచి రెండో ఘట్టం ప్రారంభమైంది. అనేక మంది తమ వద్దనున్న అనేక అమూల్య గ్రంథాలను రీడింగ్ రూమ్ గ్రంథాలయానికి ఇచ్చారు. అచ్చు యంత్రం వచ్చాక ముద్రితమైన పలు గ్రంథాలు, పంచాగాలన్నీ అక్కడ భద్రంగా ఉండేవి. రోజు రోజుకూ గ్రంథాలయం అభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రభుత్వం ఇచ్చే గ్రాంటుతో పాటు చందాదారులిచ్చిన సొమ్ముతో ఏటా పుస్తకాలు కొనేవారు. ఆంధ్రప్రదేశ్‌లో దొరకని ఎన్నో అపురూప గ్రంథాలు ఈ గ్రంథాలయంలో ఉండేవి. దూర ప్రాంతాల నుంచి పరిశోధకులు వచ్చి చానాళ్లు ఇక్కడే ఉండి గ్రంథాల నకళ్లు రాసుకుని వెళ్లేవారు. దేశీ పత్రికలకూ చోటు. ఈ రీడింగ్ రూమ్‌లో నేషనల్ జాగ్రఫిక్, రీడర్స్ డైజెస్ట్ వంటి విదేశీ పత్రికలు, ఇల్ల స్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా, ఫిల్మిండియా, కేర్వాన్ వంటి మాసపత్రికలు, తెలుగు పత్రికలు ఉండేవి. అప్పటిలో 800 మంది వరకు చందాదారులు ఉండేవారు. వీరిలో హిందువులతోపాటు క్రైస్తవులు, ముస్లింలు, బెంగాలీలు, ఆంగ్లో ఇండియన్స్ కూడా ఉండటం విశేషం.

ఉత్తరాంధ్రలోనే ప్రత్యేక స్థానం పొందిన రీడింగ్ రూమ్ సాహితీ సమావేశాలకు, విలువైన గ్రంథాలకూ, ఆధ్యాత్మిక సాంస్కృతిక సౌరభాలకు ఆలవాలం. శ్రీశ్రీ, ఆరుద్ర వంటి మహాకవులు నడయాడిన, తెన్నేటి, గిడుగు వంటి తెలుగు ఉద్దండులు మెలిగిన ప్రాంగణమది. నగరానికే సాహితీ వన్నె తెచ్చిన పురాతన వైభవమది. వందేళ్లు పైబడిన రీడింగ్ రూమ్‌కు పూర్వ వైభవం తీసుకు రావాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉన్నప్పటికీ ఎందుకనో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రెండేళ్లగా ఇది పూర్తిగా మూతపడి శిథిల భవనంలా కనిపిస్తోంది. భవనంపై చెట్లు మొలిచాయంటే ఎంత నిర్లక్ష్యంగా దీనిని విడిచిపెట్టారో అర్థం చేసుకోవొచ్చు.

ఇక్కడ ఉండే గ్రంథాలు కనుమరుగు అయ్యాయి. కొన్నాళ్లు ఇందులో చిన్న చిన్న శుభకార్యాలు కూడా అద్దె ప్రాతిపదికన జరుపుకునేవారు. ఇప్పుడు అది కూడా లేదు. కలెక్టర్ దీనికి చైర్మన్ కనుక ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, దీని పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మొదటి పేజీ తరువాయి..

బెట్టింగ్ బంగార్రాజులు

వైసిపి నాయకులు లక్ష రూపాయలు చొప్పున తమ అభ్యర్థులు గెలుస్తారని బెట్టింగులు వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. మాడుగుల టిడిపి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి గెలుస్తారని కొంతమంది వ్యక్తులు ఐదు లక్షలు బెట్టింగులు వేశారు. చోడవరం నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు గెలుస్తారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని టిడిపి నాయకులు బెట్టింగ్‌లకు దిగుతున్నారు. టిడిపి విజయం సాధిస్తుందన్న ధీమాతో ఆ పార్టీకి చెందిన వారు కొందరు మూడు లక్షలు బెట్టింగ్ వేయగా, వైసిపి రెండు లక్షలకు వేస్తున్నారు.

యలమంచిలి, పాయకరావుపేట, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. పోటీ గట్టిగా వుండడంతో అధిక మొత్తాల్లో బెట్టింగ్ వేయడానికి ప్రధాన పార్టీల కార్యకర్తలు ఆసక్తి చూపడంలేదు. అసెంబ్లీ నియోజకవర్గాలపై బెట్టింగ్‌లు కాసినా అనకాపల్లి పార్లమెంట్‌పై పెద్దగా బెట్టింగ్‌లు వేయడం లేదు.

మందుబాబులపై కొరడా !

చేశారు. జోన్ -1 పరిధిలో ఫోర్ వీలర్స్‌ను తాగి నడుపుతున్న 17 మందిపైనా, టూ వీలర్స్ నడుపుతున్న 148 మందిపైనా, ఆటోలు నడుపుతున్న 17 మందిపైనా వెరసి 183 మందిపై కేసులు నమోదు చేశారు. జోన్ - 2 పరిధిలో టూ వీలర్స్ 175, ఆటోలు 10, ఫోర్ వీలర్స్ 14, ఒక కమర్షియల్ వాహనంపై దాడులు నిర్వహించి 200 మంది వాహనదారులు తాగి వాహనాన్ని నడుపుతున్నట్టు గుర్తించారు. వారందరిపైనా కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సిపి, జెసిపి మీడియాతో మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ సమయంలో మద్యానికి దూరంగా ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉండి తద్వారా వాహనదారులు, పాదచారుల భద్రత కాపాడాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జైలు శిక్షలూ ఉంటాయన్నారు.



ఎన్‌టి.రామారావు, కృష్ణల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న ప్రతినిధులు

అలరించిన సినీ సంగీత విభావరి

సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, కార్పొరేటర్ కందుల నాగరాజు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ ఎన్‌టిఆర్, కృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత గంటి మురళిని అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, కొణతాల రాజు, విజయరమణి, ఎస్.సూర్యకళ, గ్రంధి విష్ణు తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లును పరిశీలిస్తున్న మల్లికార్జున

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదివారం ఉదయం పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు జాయింట్ కమిషనర్ ఫక్కీరప్పతో కలిసి పార్లమెంటు, అంసెబ్లీ ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడి పరిస్థితులను నిశితంగా గమనించారు. భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియ నిర్వహణలో ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా జాగ్రత్తలు వహిస్తూ పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఆర్ఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను అండర్ 9, అండర్ 11, అండర్ 13, అండర్ 15 బాలబాలికల విభాగాల్లో నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా ఈ టోర్నీ సాగింది. వివిధ సంస్థలు, అకాడమీలు, పాఠశాలల నుంచి దాదాపు 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 9 బాలుర విభాగంలో అమీర్ సాహిల్, బాలికల విభాగంలో శ్రియంక, అండర్ 11 బాలుర విభాగంలో ఆర్యన్ గోపాల్, బాలికల విభాగంలో పూజిత, అండర్ 13 బాలుర విభాగంలో షైక్ సుల్తాన్, బాలికల విభాగంలో ఎస్.సవిత శ్రీ, అండర్ 15 బాలుర విభాగంలో టి.సాయి చరణ్, బాలికల విభాగంలో కె.రేణుక సత్య విజేతలుగా నిలిచారు. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి ఐఆర్‌టిఎస్, లాల్వేమ్‌హిమ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు హిమకర్ టాటా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ డివిఎస్‌వై.శర్మ, వివిఎస్ఎన్.మూర్తి, మురళీ పాత్రో, ఎస్.రామారావు, అచ్యుత కుమార్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన వారితో అతిథులు, నిర్వాహకులు

అల్లూరి వాకర్స్ నేతృత్వాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - విశాఖపట్నం : అల్లూరి వాకర్స్ అసోసియేషన్ నేతృత్వాన రోటరీ బ్లడ్ బ్యాంక్, రత్నం మెడికల్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలు చేశారు. సీతమ్మధార డబుల్ రోడ్‌లో అల్లూరి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి నరసింహరాజు ఇంటివద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 52 మంది రక్తదానం చేశారు. 125 మంది రక్త పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి నరసింహరాజు, ఎన్.సంజీవయ్య, గౌరవాధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ అధ్యక్ష, కార్యదర్శులు జివిఎస్.రాజు, ఎన్ఎస్ఎన్.రాజు, వై.ఈశ్వర వరప్రసాద్, అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.



రక్తదాతలలో అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సర్కారు కళ్యాణ మండపాలు కరువు

ప్రజాశక్తి -తగరపువలస : శుభకార్యం అనగానే మేళ తాళ వాయిద్యాలు, స్నేహితులు, బంధువుల సందడి, నోరూరించే పసందైన వంటకాలు గుర్తుకు వస్తాయి. కాంతులు విరజిమ్ముతూ, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే వేదిక కూడా ఏర్పాట్లలో అగ్ర పీటినే ఉంటుంది. అయితే ఇక్కడి పేద, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ప్రభుత్వ కల్యాణ మండపాలు లేవనే చెప్పాలి. భీమిలిలో జివిఎంసి పరిధిలోని ఒకే ఒక్క మహాత్మా గాంధీ కల్యాణ మండపం ఉంది. ఈ మండపం నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో మందు బాబులకు, ఆకతాయిలకు నిలయంగా మారింది. జివిఎంసి రెండో వార్డు పరిధి గ్రంథాలయం వీధిలో పాత మీ సేవా కేంద్రం సమీపంలో ఎన్‌టిఆర్ కల్యాణ మండపం ఉండేది. దీన్ని భీమిలి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు నిర్మించారు. స్థానిక పేద, మధ్య తరగతి ప్రజలకు శుభ కార్యాల నిర్వహణకు అందుబాటులో ఉండేది. రైతు బజారు ఏర్పాటుకు స్థలం అవసరమని దీన్ని అప్పట్లో కూల్చేశారు. అధికారుల నిర్ణయంపై అప్పట్లో కొందరు విస్మయం వ్యక్తంజేశారు. రైతు బజారు ఏర్పాటుకు ప్రత్యామ్నాయ స్థలం చూస్తే బాగుండేదన్న అభిప్రాయాన్ని అప్పట్లో పలువురు వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాల మాట అటుంచితే రైతు బజారు నిర్మాణం ప్రస్తుతం పూర్తయింది. ఇలా ఉండగా ఇప్పటికీ వేరే చోట అయినా సరే కల్యాణ మండపం నిర్మించలేదు. జివిఎంసి నేరుగా కల్యాణ మండపాల నిర్వహణ చూసి ఉంటే బాగుండేది. ఆదాయం కూడా సమకూరేది. నిర్వహణను గతంలో కొంత మందికి లీజుకు ఇవ్వడంతో కొంత మంది లీజు దారులు లాభార్జనే ధ్యేయంగా ఉండేవారన్ని విమర్శలు లేక పోలేదు. ఇప్పటికైనా పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని జివిఎంసి భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో కొత్తగా కల్యాణ మండపాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. భీమిలిలో ఉన్న మహాత్మా గాంధీ కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులు




నిరుపయోగంగా ఉన్న చిట్టివలస జ్యూట్ కల్యాణ మండపం

చిట్టి వలస జ్యూట్ మిల్లు శాశ్వతంగా మూత పడడంతో చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో ఉన్న లేబర్ వెల్ఫేర్ సెంటర్, కల్యాణ మండపం నిరుపయోగంగా ఉన్నాయి. మిల్లు మూత పడక ముందు కార్మిక కుటుంబాలకు చెందిన వారు, పేద, మధ్య తరగతి వారు ఇక్కడనే పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలు నిర్వహించుకునే వారు. తక్కువ మొత్తం చెల్లించి శుభ కార్యాలు జరుపుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీంతో జ్యూట్ కార్మిక కుటుంబాలు, ఈ ప్రాంతంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల ను ఎంచుకుంటున్నారు. ఇక్కడున్న పలు ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో పెద్ద మొత్తంలో రుసుం ఉంటుంది. రోజుకు దాదాపు రూ.20 వేలు నుంచి రూ.లక్ష, రూ.1.20 లక్షల వరకు రుసుం ఉంటుంది. ఇక్కడి అవసరాలు, పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా జివిఎంసి ముందుకొచ్చి కల్యాణ మండపాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

జివిఎంసి కల్యాణ మండపాలు నిర్మించాలి

జివిఎంసి ఆధ్వర్యాన కల్యాణ మండపాలు నిర్మించి పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. చిట్టివలస జ్యూట్ మిల్లు మూత పడక ముందు కార్మిక, పేద, మధ్య తరగతి ప్రజలకు జ్యూట్ మిల్లు యాజమాన్యం నిర్వహణలో ఉండే కల్యాణ మండపం, లేబర్ వెల్ఫేర్ సెంటర్ ఎంతో ఉపయోగపడేవి. ప్రస్తుతం మిల్లు మూతపడడంతో నిరుపయోగంగా ఉన్నాయి.



డి.బాబాజీ
విశ్రాంత జ్యూట్ కార్మికుడు
చిట్టివలస

పేద, మధ్య తరగతి ప్రజల అవస్థలు

ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. ఆయా కుటుంబాల్లోని వారు వివాహాలు, శుభకార్యాలు జరుపుకోవాలంటే లక్షల రూపాయలు చెల్లించి ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో జరుపుకోలేరు. అవసరాలను, ప్రాధాన్యతను గుర్తించి ప్రభుత్వం కల్యాణ మండపాలు నిర్మించాలి.



కర్రి రాము
బంగ్లామెట్ట
తగరపువలస

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చీడికాడ: ఉరేసుకుని ఓ వ్యక్తి శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చీడికాడకు చెందిన డోకల సన్నిబాబు, లక్ష్మి భార్యాభర్తలు. భార్య, కుమారుడిని వదిలి గత కొన్నేళ్ల క్రితం గాజువాక ప్రాంతానికి వెళ్లిపోయిన సన్నిబాబు అక్కడ మరో ఆమెను వివాహం చేసుకొని జీవిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం తన చిన్నాన్న డోకల శ్రీరామ్ మూర్తికి ఫోను చేసి గ్రామంలో మన వాళ్ళని చూడాలని ఉందని, వస్తానని చెప్పాడు. శనివారం రాత్రి చీడికాడ గ్యాస్ గోదాము సమీపాన గల డోకల మరిడమ్మ కల్లం వద్ద చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరునాడు ఉదయం ఎర్రి నాయుడు కళ్లానికి వెళ్లి గేదెలను కట్టేందుకు ప్రయత్నించగా మృతదేహం వేలాడుతూ ఉండటంతో భయంతో గ్రామస్తులకు తెలిపాడు. స్థానిక ఎస్సై నారాయణరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా తనని వివాహం చేసుకున్న తరువాత కుటుంబీకులతో తత్సంబంధాలకు పూర్తిగా దూరమయ్యానని ఆవేదన వ్యక్తం చేసేవాడిని, మనస్థాపంతో ఉరి వేసుకుని చనిపోయాడని రెండవ భార్య మంగాదేవి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

ఐదుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్య పేట మండలం బంగారుమెట్ట గ్రామ శివారులో కోడిపందేలు శిబిరంపై పోలీసులు దాడి నిర్వహించారు ముందస్తు సమాచారం మేరకు గ్రామశివారులో కోడిపందేలు ఆడుతున్న శిబిరంపై దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్ఐ డిఈశ్వరరావు తెలిపారు. నిందితుల నుంచి రూ.1350 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులోహాజరు పరుస్తామని తెలిపారు.

వేసవి ఉపశమనానికి నదీ స్నానాలు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గోస్తనీ నది దివాన్జీ కాలువ నిండా నీరు నిలవ ఉండటంతో కొంతమంది యువకులు స్నానాలు చేసి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. మద్ది గ్రామంలో ఉన్న యువకులు పదుల సంఖ్యలో నది స్నానాలను రోజూ ఆచరిస్తున్నారు.



దివాన్జీ కాలువలో సేద తీరుతున్న యువకులు

గ్రామాలకు ఆర్‌టిసి సేవలను విస్తరించాలి

వ్యాపారస్తులు, గ్రామస్తులు, విద్యార్థుల విన్నపం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆర్‌టిసి సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింతగా విస్తరించాలని మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గతంలో విశాఖ నుంచి బోని మీదుగా పాండ్రంగి వరకు, మండల కేంద్రమైన అనందపురం గ్రామానికి, వెల్లంకి తదితర గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు నడిపేవారని ప్రజలు చెబుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు, వ్యాపారస్తులకు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని చెప్పారు. ప్రస్తుతం బస్సులను నడపకపోవడంతో ఆనందపురం కూడలిలో మార్కెట్‌కు రైతులు పండించిన పూలు, కూరగాయలను తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులకు బస్సు పాసులు ఉన్నప్పటికీ ఆనందపురం, విశాఖ తదితర ప్రాంతాలు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింతగా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కుసులువాడకు 222 ఆర్‌ఎస్ సిటీ బస్సు కేవలం ఉదయం పూటనే నడుపుతున్నారని, రోజుకు కనీసం మూడు ట్రిప్పులైనా నడిపితే ప్రయాణికులకు, విద్యార్థులకు, రైతులకు, ఉద్యోగస్తులకు సౌకర్యంగా ఉంటుందని వివిధ గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ బస్సు ద్వారా ఆనందపురం నుంచి కుసులవాడ వరకు సుమారు 10 గ్రామాల వరకు ఉపయోగం ఉంటుందంటున్నారు. ఈ బస్సును ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో నడిపితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలలు తెరుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆర్‌టిసి అధికారులు బస్సుల ట్రిప్పులను పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.


నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఆర్య వైశ్య సంఘం, ఆర్య వైశ్య యువజన సంఘం, వాసవి ప్రార్థనా మందిరం సంఘాలకు నూతన కార్యవర్గం ఎన్నికను శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులుగా పూసర్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బొండా వెంకటనాగ బాలాజీ, కోశాధికారిగా మాదా వెంకట జగన్నాథగుప్తా, శ్రీ వాసవి ప్రార్థన మందిరం సంఘం అధ్యక్షులుగా కట్టమూరి రమణారావు, కార్యదర్శిగా కంచర్ల కామేష్, కోశాధికారిగా బొండా కిరణ్, ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా ముమ్మిడి శెట్టి సునీల్, కార్యదర్శిగా ఉసిరికల విశ్వేశ్వరరావు, కోశాధికారిగా ఉసిరికల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సునీల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవి పార్వతీశం అధ్యక్షతన ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. 2024-26 వరకు వీరి పదవీ కాలం ఉంటుందని వివరించారు. ప్రముఖ న్యాయవాది పోలిశెట్టి వెంకటేష్, ఉసిరికిల బంగార్రాజు, గుగ్గిళ్ళ సాయి, సంఘం మాజీ అధ్యక్షులు బొండా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక సిబిఎం హైస్కూల్‌లో 2004 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు దాదాపు 20 ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు కష్ట సుఖాలు, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పటి అనుభూతులను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి హెచ్ఎం, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. సుదీర్ఘకాలం తర్వాత ఒకే చోట కలయిక తమలో చెప్పలేనంత అనుభూతి కలిగిందని పలువురు అభిప్రాయపడ్డారు. పూర్వ విద్యార్థుల్లో పోలీస్, బ్యాంక్, ఉపాధ్యాయులు, ఆర్మీ తదితర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన వారు కొందరైతే, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిర పడిన వారు మరికొందరు ఉన్నారు. పూర్వ విద్యార్థుల్లో చాలా మంది బెంగళూర్, హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చారు.



ఒకే చోట కలుసుకున్న సిబిఎం హైస్కూల్ టెన్త్ పూర్వ విద్యార్థులు

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జెడ్‌పిహెచ్ పాఠశాల 1989-90 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. విజయనగరంలోని హోటల్‌లో ఆదివారం వారంతా కలుసుకున్నారు. పాఠశాలను విడిచి 35 ఏళ్ల అనంతరం మిత్రులందరూ కలవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలతో పాటు వారి కుటుంబాలు, పిల్లల చదువులు, ఉద్యోగాల గురించి చర్చించుకున్నారు. గత జ్ఞాపకాలను, అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి అప్పల వెంకటరామారావు, కశిరెడ్డి బాలాజీ, కాళ్ల గోపీనాథ్, రెడ్డిపల్లి గోవిందరావు, గండి వెంకటరావు, తాలాడ పద్దు, బుగత బుజ్జి, ఎస్‌కెఎస్.ప్రసాద్, నిమ్మకాయల ఆదియ్య, తిర్నెడ్డి అప్పలరాజు, జంకల అప్పలరాజు, వడ్డాది శ్రీను, అవనాపు దేవుడు, సుంకర ఇందిర, రెడ్డిపల్లి బాల సరస్వతి, సుంకర హిమవతి తదితరులు పాల్గొన్నారు.



కలుసుకున్న రెడ్డిపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్ టెన్త్ పూర్వ విద్యార్థులు

డ్రెయినేజీలతో పరేషాన్

రోడ్డుపైకి మురుగునీరు
అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు



విశాలాక్షినగర్‌లో రహదారిపైకి వస్తున్న మురుగు నీరు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో పోలమాంబ అమ్మవారి ఆలయానికి ఎదురుగా పోలీస్ బెటాలియన్ కొండపైకి వెళ్లే ప్రధాన రహదారి పక్క కాలువలో చెత్త పేరుకు పోయింది. దీంతో కాలువల్లోని మురుగు నీరు రోడ్డుపైకి చేరి పారుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో చెత్త పేరుకు పోవడంతో, నీరు సజావుగా వెళ్లే దారిలేక మురుగంతా రహదారిపైకి వచ్చి పారుతోంది. వాహనదారులు, పాదచారులు మురుగు నీటి మీదే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. రహదారిపై మురుగు నీరు ప్రవహించడంతో దుర్వాసన, అపారిశుధ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు ప్రబలి అనారోగ్య సమస్యలు వస్తాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జివిఎంసి దృష్టి సారించి ఎప్పటికప్పుడు కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, నీరు సజావుగా పోయేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గెడ్డల్లో చెత్త

సీతమ్మధార : గెడ్డల్లో చెత్త, కాలువల్లో మురుగునీరు



శాంతిపురం గెడ్డలో పేరుకుపోయిన చెత్త



లలితానగర్‌లో నిల్వ ఉన్న మురుగునీరు

నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 25వ వార్డు శాంతిపురం గెడ్డలో చెత్త నిలిచిపోయింది. 20 రోజుల నుంచి గెడ్డలో చెత్త నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. తీవ్ర దుర్వాసన కూడా వస్తుండటంతో అటువైపుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి 26వ వార్డు పరిధి లలితానగర్ గ్రీన్ గార్డెన్ అపార్ట్‌మెంట్ పక్కన 15 రోజుల నుంచి మురుగునీరు నిలిచిపోయింది. దోమలు వ్యాప్తి చెందాయని, తీవ్ర దుర్వాసన వస్తోందని అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళన చెందుతునానరు. ఇప్పటికైనా జివిఎంసి అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయాప్రాంత వాసులు కోరుతున్నారు.



కార్తికేయరెడ్డితో తల్లిదండ్రులు

అంతర్జాతీయ మోడలింగ్ పోటీలకు కార్తికేయ రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి -గాజువాక : కేరళ రాష్ట్రం కాలికట్‌లో ఇటీవల జరిగిన జాతీయ జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ సీజన్ -8 పోటీల్లో షీలానగర్‌కు చెందిన బిజె.కార్తికేయ రెడ్డి విజేతగా నిలిచారని తల్లిదండ్రులు పావనీలత, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీని ద్వారా థాయిలాండ్‌లో ఆగస్టులో జరగనున్న అంతర్జాతీయ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాలని పేర్కొన్నారు. గాజువాకలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆంధ్ర ఫ్యాషన్ వీక్‌లో విజేతగా నిలిచిన కార్తికేయ రెడ్డి కాలికట్‌లో జరిగిన పోటీలలో ప్రిన్స్ అండర్ -8 విభాగంలో పాల్గొని ఇంటర్వ్యూ తో పాటు ఇతర విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రోఫీని కైవసం చేసుకున్నాడని తెలిపారు. ఈ పోటీల్లో విజేతగా నిలవడంతో కార్తీక్ రెడ్డి అంతర్జాతీయ జూనియర్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాలని తెలిపారు. కార్తికేయరెడ్డి నాలుగో తరగతి చదువుతున్నారు. తల్లి పావనీలత భెల్ హెచ్‌పివిసిలో ఇంజినీర్‌గానూ, తండ్రి ఇఐఎల్‌లో ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ఉడాకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మాధవధార : మాధవధార ఉడా కాలనీలో గల మాధవధార ఉడా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024-26వ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నడింపల్లి సూర్యనారాయణరాజు తెలిపారు. ఈ నెల 7వ తేదీన మాధవధార ఉడా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా ఏకగ్రీవంగా కార్యవర్గం ఎన్నిక చేసేందుకు ఈ నెల 24వ తేదీన కాలనీ వాసులు మొగ్గు చూపారని ఎన్నికల అధికారి తెలిపారు. నూతన కార్యవర్గం అధ్యక్షులుగా బి.గోపాల్‌రాజు, ఉపాధ్యక్షులుగా ఎమ్‌వికెఎస్ సూర్యనారాయణమూర్తి, ఎన్.చంద్రశేఖర్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా డిఎస్.వీరభద్రరావు, ఉప కార్యదర్శిగా పి.రవికుమార్, వి.లక్ష్మినారాయణ, ఎన్‌విఎస్.రామకృష్ణ, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా బి.బలరాం, పి.పూర్ణచంద్రరావు, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాస్, ఎమ్‌జిఎస్ భాస్కర్‌రాజు, సిహెచ్.విష్ణువర్ధనరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు.

కొత్తందాలు.. వైవిధ్య చిత్రాలు...

ప్రజాశక్తి -మధురవాడ : అటవీశాఖ పరిధి పిఎంపాలెం న్యాయ కళాశాల కూడలిలోని తూర్పు కనుమల జీవ వైవిధ్య కేంద్రం (ఈస్టన్ ఘాట్స్ బయో డైవర్సిటీ సెంటర్)లో వృథా ఇనుముతో సందర్శకులను ఆకట్టుకునే చిత్రాలు రూపొందించారు. ప్రకృతి వివరణ కేంద్రం వద్ద గోడపైనా, ఆవరణలో తేనెటీగల నుంచి పట్టును వేరు చేస్తున్న అడవిబిడ్డ, ఆకట్టుకునే రీతిలో అలుగు జంతువు చిత్రాలను తీర్చిదిద్దారు. ఇవి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



వేస్ట్ ఇనుముతో తయారుచేసిన అలుగు

ఐఐఎంలో ఎగ్జిక్యూటివ్ ఎంబిఎ 2వ బ్యాచ్ ప్రారంభం



గంభీరంలోని ఐఐఎంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో ఆదివారం ఉదయం ఎగ్జిక్యూటివ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ రెండవ బ్యాచ్ ప్రారంభ కార్యక్రమం గంభీరంలోని శాశ్వత క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లార్సెన్, టబ్రో లిమిటెడ్ కార్పోరేట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్ ఎంవిఎన్ రావు విద్యర్థులనుద్దేశించి మాట్లాడారు. చేసే పనిలో నైపుణ్యం ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ నేర్చుకునే విద్య భవిష్యత్తులో ఏ విధంగా ఉపయోగించాలో తెలిపారు. వాటాదారుల నిర్వహణ, వారి ప్రాముఖ్యతతో పాటు వ్యూహాల అమలు ఆవశ్యకతను, సాంకేతిక ప్రావీణ్యతను, మానవీయ విధానం అంశాలను వివరించారు. అనంతరం ఐఐఎం ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ. ఐఐఎం విశాఖపట్నం బృందం అద్భుతమైన అభ్యాస అనుభవాన్ని అందించడానికి కట్టుబడి ఉందని, సమకాలీన నిర్వహణ దృశ్యాలను ప్రతిబింబించేలా కేస్ స్టడీస్‌ను అభివృద్ధి చేయడానికి అధ్యాపక సభ్యులతో సహకరించుకోవడానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారి పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడానికి అధ్యాపక బృందం సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ హ్యాపీ పాల్, అడ్మిషన్ చైర్ ప్రొఫెసర్ కావేరీ కృష్ణన్, టైమ్స్‌ప్రో సిఇఒ అనిష్ శ్రీకృష్ణ, టైమ్స్‌ప్రో సిబిఒ సునీల్ సూద్ తదితరులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులో ఉన్న ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎఎంసి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో ఆంధ్ర మెడికల్ సెంటర్, విజయ డయాగ్నొస్టిక్ సెంటర్, డయాగ్నొస్టిక్ డ్రాగన్స్ ఆధ్వర్యాన క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు ప్రారంభించారు. ఈ పోటీలలో ఎఎంసి జట్టు విన్నర్‌గానూ, డిడి జట్టు రన్నర్‌గాను నిలిచాయి. వీరికి మజ్జి వెంకట్రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. మన స్వచ్ఛంద సంస్థలు యువకులను ప్రోత్సహించి మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మజ్జి రమేష్, ఓం సుఖీభవ మెడికల్ షాప్ అధినేత కోరాడ ఆదినారాయణ, ఎంపిటిసి మాజీ సభ్యులు సూరిబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మజ్జి వెంకటరావు

స్విట్జర్లాండ్‌లో వరుణ్ సత్యం స్టార్టప్

ప్రజాశక్తి-విశాఖపట్నం: విశాఖలో ప్రారంభించిన వరుణ్ సత్యం స్టార్టప్ ప్రధాన కార్యాలయాన్ని స్విట్జర్లాండ్ లో ప్రారంభించింది. వరుణ్ సత్యం కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్. విశాఖ నుంచి మొదటి తరం స్టార్టప్ వ్యవస్థాపకుడు. దావోస్ ప్రోటోకాల్ సహ వ్యవస్థాపకుడు. 2016 బ్యాచ్ నుంచి బ్లాక్‌చెయిన్, క్రిప్టో సాంకేతికతల బ్యాక్ గ్రౌండ్‌తో వాటిని భారతదేశం అందిపుచ్చుకోవటంలో వరుణ్ ముందంజలో ఉన్నారు.

పేదింట విరిసిన విద్యా కుసుమం

● ఎపిఆర్ఎస్ ప్రవేశపరీక్షలో కీర్తికి స్టేట్ ఫస్ట్‌ర్యాంకు



స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ కీర్తి, ఇతర విద్యార్థులను అభినందిస్తున్న గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : పేదింట విద్యా కుసుమం విరిసింది. గ్రామీణ ప్రాంతంలో నిరుపేద కుటుంబంలో పుట్టినప్పటికీ, చదువులో మిన్నగా రాణిస్తూ, ఐదవ తరగతి ప్రవేశాలకు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఎపిఆర్ఎస్ 2024 ప్రవేశపరీక్షల్లో నూటికి 99 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలోనే మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని మల్లారపు కీర్తి సత్తా చాటింది. మండలంలోని పెంద్రంగి పాఠశాల విద్యార్థులు ఇదొక్కటే కాకుండా మరో ఏడు ఉత్తమ ర్యాంకులను సాధించారు.
ఎపిఆర్ఎస్ 2024 ప్రవేశపరీక్షలో పెంద్రంగి పాఠశాలకు చెందిన మల్లారపు కీర్తి స్టేట్ ఫస్ట్‌ర్యాంకు సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన జె.మంజుల ఎపిబిసిడబ్ల్యుఆర్ ప్రవేశపరీక్షలో జిల్లాస్థాయిలో రెండవ ర్యాంక్‌ను, ఎల్.మోక్షశ్రీ నాలుగో ర్యాంకు, ఎం.కావ్య ఆరో ర్యాంకు, జి.ఓంకార్ 20వ ర్యాంకు, జి.నిహారికి 81వ ర్యాంకు, ఎం. అఖిల్ ఇలా ఏడుగురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి, అందరూ పెంద్రంగి పాఠశాల వైపు చూసేలా సత్తా చాటారు.
పెంద్రంగి పాఠశాల కీర్తిని ఇనుమడింపజేసేలా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ జె.రామలక్ష్మి, ఎంపిటిసి గోపి , పాఠశాల ఛైర్‌పర్సన్ బాదిరెడ్డి దేవి, పూర్వ హెడ్‌మాస్టర్ ఎన్.సూరిబాబు, గ్రామ పెద్దలు ఎల్.చంద్రరావు , గ్రామ యువత జె.శ్రీను, ఎస్.ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. దుశ్శాలువతో సత్కరించారు . మొట్టమొదటిగా మన గ్రామం నుంచి ఇలాంటి ఘనత సాధించిడానికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బంగారునాయుడు, టీచర్ పి.రమేష్‌లను గ్రామ సర్పంచ్, పెద్దలు సత్కరించి అభినందించారుపిల్లలు ఇలాంటి అద్భుతమైన విజయం సాధించడానికి ప్రస్తుత ఉపాధ్యాయులతో పాటు గతంలో గ్రామంలో పనిచేసిన పూర్వ హెడ్మాస్టర్ ఎన్.సూరిబాబు(రాజు) వేసిన పునాది కూడా కారణమని గ్రామ పెద్దలతో పాటు, పిల్లల తల్లిదండ్రులు, ప్రస్తుత ఉపాధ్యాయులు కొనియాడారు

రాష్ట్రస్థాయిలో ఎపిఆర్ఎస్ ప్రవేశపరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని ఎమ్.కీర్తి కుటుంబానికి పూర్వ హెచ్ఎం సూరిబాబు తన వంతుగా రూ.15వేలు ఆర్థిక సాయం అందించి ప్రోత్సాహించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వారైనప్పటికీ, పిల్లలను ఉత్తమంగా చదివిస్తున్న కీర్తి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కె.అశోక్ కుమార్, ఆర్.సురేష్ (యుటిఎఫ్), పోతల నాయుడుబాబు. ప్రవీణ్ (పిఆర్‌టియు), ఎస్.శ్రీను, బోకం లలితప్రసాద్ (ఎపిటిఎఫ్) హాజరై అభినందించారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యంలో
410 మందికి కంటి పరీక్షలు



వైద్యసేవలను పర్యవేక్షిస్తున్న బ్రాండిక్స్ పార్టనర్ దొరైస్వామి

ప్రజాశక్తి -అచ్యుతాపురం :బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన 126వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 410 మంది రోగులకు నేత్ర వైద్యులు పరీక్షలు చేశారు. శిబిరానికి వచ్చిన 278 మంది కంటి రోగులకు ఉచిత అద్దాలను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు మందులు ఇచ్చారు. 50 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులకు వారి బంధువులకు బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ఫలహారం భోజనం సదుపాయం కల్పించారు.
కంటి వైద్యశిబిరాన్ని బ్రాండిక్స్ ఇండియా పార్ట్నర్ దొరస్వామి పర్యవేక్షించారు. కంటి రోగులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్రాండిక్స్ ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రతిభా అవార్డుల ప్రదానం



దేవాంగ విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి శ్రీచౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముప్పన సిల్క్ అధినేత ముప్పన సుబ్రహ్మణ్యం ఆర్థిక సహకారంతో ఆదివారం 2023- 24లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పట్టణ దేవాంగ విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. అనకాపల్లి పట్టణ పరిధిలోని 30 మంది విద్యార్థులకు గొల్లవీధి ముప్పన కనకరాజు కల్యాణ మండపంలో ప్రతిభ అవార్డులను అందజేశారు.
కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, కార్యదర్శి కాలేపు సదాశివరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు రెడ్డి వరప్రసాద్, కార్యదర్శి బూడిద నాగేశ్వరరావు, జాతీయ అవార్డు గ్రహీత వైఆర్‌కె చక్రవర్తి మాస్టారు, అల్లాడ పాండురంగ మాస్టారు, ముప్పన సిల్క్ అధినేత ముప్పన కాశీ, బాసిన బాల గురూజీ, ఉప్పు సాంబమూర్తి, అల్లంకి మోహన, వేమన సంతోష్‌కుమార్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి ● అనకాపల్లి జిల్లా నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

ప్రజాశక్తి- అనకాపల్లి : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి అన్నారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక భవనంలో నిర్వహించిన ఐద్వా సమావేశంలో ప్రభావతి మాట్లాడుతూ మహిళలందరూ బాగా చదువుకోవాలని, విద్యావంతులు కావాలని, తమ సమస్యలు పరిష్కరించుకొనే పరిజ్ఞానం సంపాదించుకోవాలన్నారు. మహిళలు వివిధ స్థాయిలలో, అనేక రంగాలలో అభివృద్ధి సాధించాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో సుమారుగా రూ.1.50కోట్ల మంది మహిళలు ఐద్వాలో సభ్యులుగా ఉన్నారని, సంఘాన్ని మరింత విస్తృత, పటిష్టపరిచి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ఐద్వా జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతరం అనకాపల్లి జిల్లా ఐద్వా నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా కమిటీ అధ్యక్షులుగా పి.మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా డిడి. వరలక్ష్మి, కోశాధికారిగా కెవి.సూర్యప్రభ, ఉపాధ్యక్షులుగా ఎల్.గౌరీ, జాయింట్ సెక్రటరీగా రావి లక్ష్మి, కమిటీ సభ్యులుగా వాణిశ్రీ, మానస, ఆర్.లక్ష్మి, యు.లోవ, ఎం.శ్రీదేవి, మంగతాయారు, రెడ్డి వరలక్ష్మి, ఆఫీస్ బేరర్లుగా యు. నాగమణి, లావణ్య, సుస్మిత, కుమారి ఎంపికయ్యారు.





పి.మాణిక్యం (అధ్యక్షురాలు) డిడి.వరలక్ష్మి (ప్రధాన కార్యదర్శి)

డైట్‌లో ముగిసిన 'హ్యాపీనెస్ ప్రోగ్రాం'



ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్స్‌ను సత్కరిస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో ప్రపంచ ప్రఖ్యాత గురుదేవ్ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ అఫ్ లివింగ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. 'హ్యాపినెస్ ప్రోగ్రాం ఫర్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్' కార్యక్రమంలో భాగంగా డైట్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ప్రాణాయామం, సుదర్శన క్రియ, ప్రతి ఒక్కరూసంతోషంగా జీవించడానికి కావాల్సిన విధి విధానాలను ఆర్ట్ అఫ్ లివింగ్ ట్రైనర్లు రాఘవేంద్ర, హరీష్, పద్మ నేర్పించారు.
ముగింపు సమావేశంలో డైట్ ఛైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ, తమ కాలేజీలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ పండిట్ రవిశంకర్ వసుధైక కుటుంబం నినాదం యావత్తు ప్రజానీకానికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ, శ్వాస, ధ్యానం, యోగా అధ్యయనంతో ఒత్తిడిని జయించి, సంతోషంగా ఉండొచ్చన్నారు. అనంతరం ఆర్ట్ అఫ్ లివింగ్ ట్రైనర్లు రాఘవేంద్ర, హరీష్, పద్మలను కళాశాల ఛైర్మన్ రత్నాకర్ జ్ఞాపిక బహూకరించి శాలువాతో సన్మానించి పట్టు వస్త్రాలు సమర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.దుర్గ శ్యాంప్రసాద్, డీన్ అకడమిక్స్ డాక్టర్ కె.పార్వతి, డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్. ఈశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు హేమంత్ కుమార్, మైత్రి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలుపుదలపై ముందస్తు సమాచారం ఇవ్వరేం?

ప్రజాశక్తి -అచ్యుతాపురం : విద్యుత్ సబ్‌స్టేషన్‌లోనూ, లైన్ల మరమ్మతులు, నిర్వహణ సమయంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్న సందర్భంలో సంబంధిత ఎపిఇపిడిసిఎల్ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరా నిలుపుదలపై రెండు రోజులు ముందుగా సమాచారం ఇస్తే ప్రత్యమ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవడానికి అవుతుందని వినియోగదారులు చెబుతున్నారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగానే సంబంధిత అధికారులు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నప్పటికీ, దానికి సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులకు ముందుగా చెప్పడంలో ఏం అభ్యంతరమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నాబ్ నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

215 రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గం : సిపిఎం



ఆందోళన చేస్తున్న నాబ్ నిర్వాసితులతో సిపిఎం నేతలు

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్ : నాబ్ నిర్వాసితుల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా నాయకులు రొంగలి రాము ఆరోపించారు. పెద్దకలవలపల్లి చుట్టూ నాబ్ నిర్మిస్తున్న రక్షణగోడకు వ్యతిరేకంగా 215 రోజులుగా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆదివారం నిరసన దీక్ష శిబిరాన్ని సిపిఎం నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2009లో వాడ నరసాపురం, కొత్తపట్నం, బంగరమ్మపాలెం గ్రామాల సమస్యలను, అలాగే పుడిమడక పైపులైన్ సమస్య, 2023లో మళ్లీ వాడ నరసాపురం, కొత్తపట్నం సమస్యలపై పోరాటం చేసి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కారానికి సిపిఎం కృషి చేసిందన్నారు. అయినప్పటికీ ఇంకా ఎన్నో నిర్వాసితుల సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ముఖ్యంగా పెద్దకవలపల్లిలో సుమారు 8 కిలోమీటర్ల మేర ప్రజల నివాసాలు, గ్రామాలకు అడ్డంగా నాబ్ నిర్మిస్తున్న రక్షణ గోడ వల్ల ఏళ్లతరబడి ఇక్కడే నివసిస్తున్న వారికి ఇబ్బందులు కలిగే పరిస్థితి ఉండగా, కనీసం వారిని సంప్రదించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకెళ్లడం దుర్మార్గమన్నారు.. సిపిఎం మండల కన్వీనర్ జి.దేముడు నాయుడు మాట్లాడుతూ నాబ్ నిర్వాసితుల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిర్వాసితుల పక్షాన పోరాటానికి సిపిఎం ఎపుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమములో మాజీ ఎంపిటిసి రావి దేముల్లు, మారిశెట్టి నాగలక్ష్మి, పుణ్యమంతుల వారాలు, ఎలమంచిలి లక్ష్మి పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో కోలాటం పోటీలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు భాగంగా ఏర్పాటుచేసిన అంతర రాష్ట్ర కోలాటం పోటీలు ఆదివారం కొనసాగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి కోలాటం పోటీలలో మహిళలు బృందాలుగా వచ్చి పాల్గొంటున్నారు. ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త భీశెట్టి రాము, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. పోటీలను తిలకించడానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ద్వారకానగర్‌లో కార్డన్ సెర్చ్

సరైన రికార్డులు లేని 79 వాహనాలు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం పట్టణ పరిధిలో ద్వారాకానగర్ ప్రాంతంలో ఆదివారం వేకువజామున స్థానిక సిఐ బి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సక్రమంగా రికార్డులు లేని నాలుగు ఆటోలు, ఒక జీపు, 74 బైక్‌లతో కలుపుకుని మొత్తంగా 79 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్నికల నేపథ్యంలో పూర్తి అప్రమత్తత చర్యల్లో భాగంగా ద్వారకానగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించామని, సరైన రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయా వాహన యజమానులు తగిన ఆధారాలను చూపి వాహనాలను తీసుకెళ్లవచ్చని సూచించారు. దొంగతనం చేసిన వాహనాలను ఎవ్వరైనా కొనుగోళ్లు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లో సమావేశాలను నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో దాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో చోడవరం సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

అచ్యుతాపురం : స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం ఎదురుగా మార్టూరు జంక్షన్‌లో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాటి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాటిపై కేసులు నమోదు చేశారు. ప్రతిఒక్కరూ వాహనం నడిపేటప్పుడు వారి దగ్గర సంబంధిత రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ఇతర సర్టిఫికేట్‌లతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ విధిగా కలిగి ఉండాలని, లేకుంటే కేసులు తప్పవని హెచ్చరించారు.

నిండా గోతులు..కమ్మేసుకున్న తుప్పలు

రాకపోకలకు పరేషాన్!

- మలుపుల రోడ్డులో నిత్యం ప్రమాదభరిత ప్రయాణం
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, నేతలు



గోతులు, మలుపులున్న రోడ్డును కమ్మేసిన తుప్పలు

ప్రజాశక్తి - పరవాడ : రోడ్డు నిండా గోతులమయం.. అడుగడుగునా ప్రమాదకర మలుపులు.. అవి చాలవన్నట్లు రోడ్డుకు ఇరువైపులా కమ్ముకున్న దట్టమైన ముళ్లపొదలు, తుప్పలతో రావాడ పంచాయతీ పరిధిలోని ప్రధానరోడ్డు ప్రయాణసంకటంగా ఉంది. దీంతో వాహన రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీనిపై పలుమార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా ఏఒక్కరూ స్పందించడం లేదని, కనీసం గ్రామ పంచాయతీ ద్వారానైనా రోడ్డు పక్కల్లోని తుప్పలు తొలగించాలని వేడుకున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు వాపోతున్నారు.
మండలంలోని రావాడ పంచాయతీ నునపర్తి జంక్షన్ నుంచి ఎన్‌టిఆర్ కాలనీ, గొల్లగరువు, రేఖవాని పాలెం, గొల్లగుంట, నునపర్తి, నడింపల్లి పరిసర గ్రామాలకు వెళ్లే రహదారి ప్రమాదభరితంగా ఉంది. ఒకవైపు రోడ్డంతా గోతులమయంగా ఉండగా, మరోవైపు రహదారికి ఇరువైపులా ఏపుగా తుప్పలు పెరిగిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు అనునిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపొడుగునా మలుపులు ఉండడంతో, ఉన్న రోడ్డును పొదలు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనబడని పరిస్థితుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఎంత జాగ్రత్తగా వెళ్లినా, ఈ మార్గంలో గమ్యం చేరేవరకు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. రహదారి మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఢీకొని ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేక చోటుచేసుకున్నాయని స్థానికులు అంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు రావాడ గ్రామ పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఏఒక్కరూ స్పందించలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డులోని గోతులను పక్కనబెడితే, కనీసం రోడ్డును కమ్మేసిన పొదలనైనా తక్షణం తొలగిస్తే కొన్ని ప్రమాదాలను నివారించడానికి ఆస్కారముంటుందని అంటున్నారు. రావాడ పంచాయతీ పరిధిలోని నునపర్తి జంక్షన్ నుండి రేఖవానిపాలెం గ్రామం వరకైనా రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలను పంచాయతీ ఆధ్వర్యంలోనైనా తొలగించాలని వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ లైన్

ఒరిగిపోయిన స్తంభాలు.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని చిననందిపల్లి నుంచి చేనులపాలెం వెళ్లే మార్గంలో భీమవరపు వారి కల్లాల నుంచి గొర్రెపోటు వారి కల్లాల వంకు పంట పొలాలలో ఉన్న విద్యుత్ లైన్ ప్రమాదభరితంగా ఉంది. నాలుగు విద్యుత్తు స్తంభాలు అటొకటి, ఇటొకటి అన్నట్లు వంపులు తిరుగుతూ, నేలకొరిగి ఉండడంతో అటుగా వెళ్లే రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేలాడుతున్న విద్యుత్‌లైన్ వల్ల ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులకు విన్నవించుకున్నా కనీసం పట్టించుకోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎఇఇ శంకరరావును ప్రశ్నించగా, సమస్య తమ దృష్టికి వచ్చిందని మంగళవారం లోగా పరిష్కరిస్తామన్నారు.



వయ్యారాలు పోతున్నట్లు ఉన్న విద్యుత్ లైన్!

ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట : గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాల ఉపయోగాలు, వాటి పనితీరు, వాటి ద్వారా రైతులకు అందుతున్న సేవలు, ఇతర ప్రయోజనాలపై వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. ఆదివారం పి. భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయం, ఎచ్చర్లలోని కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు నాటిక రూపంలో ప్రదర్శన ఇచ్చి రైతులకు అవగాహన కల్పించారు. ఆధునిక సాగులో రైతులకు పని అనుభవం, నూతన వంగడాల ఆవిష్కరణలో కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు శశికళ, పూజిత, పల్లవి, నికిత, షారోన్, ప్రత్యూష, తేజస్విని, పలువురు రైతులు పాల్గొన్నారు



ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

ఆక్యుపంక్చర్ థెరపీపై అవగాహన



సూచనలు అందిస్తున్న డాక్టర్ బశ్శిల

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక వాకర్ ఫ్రెండ్స్ హెల్త్‌క్లబ్ భవనంలో ఆదివారం ఆక్యుపంక్చర్ థెరపీపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న డాక్టర్ గొటివాడ బాస్విల ఆక్యుపంక్చర్ థెరపీ ప్రయోజనాలను వివరించారు. వ్యాధులు వచ్చిన తర్వాత మందులు వాడుతూ కలత చెందే కన్నా, వ్యాధులు రాకుండా శరీరాన్ని నేచురోథెరపీ ద్వారా సంరక్షించుకోవచ్చన్నారు. యోగాభ్యసనతోపాటు ఇతర సాధనాలు వంటివి చేస్తే మంచిదన్నారు. వాకర్ క్లబ్ అధ్యక్షుడు ఒరుగంటి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు చిరికి దేవానంద్, విశ్రాంత ఇఇ. ఆర్. కన్నంనాయుడు, కె. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. క్లబ్ తరుపున డాక్టర్ బస్విలను జ్ఞాపిక అందజేసి, సుగ్గు అప్పలరాజు, ఎ. శ్రీనివాస్ సత్కరించారు.

ఫుట్‌పాత్ వంతెన లేక రైతుల పాట్లు

- పంటపొలాలకు వెళ్లేందుకు తప్పని అగచాట్లు
- పోలవరం కాలువ దాటేందుకు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి- కశింకోట: పోలవరం కాలువపై ఫుట్‌పాత్ వంతెన నిర్మించాలని కశింకోట మండలం తాళ్లపాలెం రెవెన్యూ గైతలుపాలెం రైతులు కోరుతున్నారు పోలవరం కాలువలో భూములు కోల్పోయిన రైతులకు చెందిన మిగిలిన భూములు కాలువకు రెండోవైపున ఉండిపోయాయి. 10 మంది రైతులకు చెందిన 25 ఎకరాలు వరకు భూమి కాలువకు అవతల ఉండడంతో ఆయా పంటపొలాల సాగు, ఇతర పనులకు కాలువ దాటి వెళ్లక తప్పని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో కాలువపై ఫుట్‌పాత్ వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉన్న కొద్దిపాటి భూమిని సాగుచేయాలంటే కాలువ అవతలకు వెళ్లాల్సిందేనని, దీనికోసం గొబ్బూరు వైపు వెళ్లి చుట్టూతిరిగి పంటపొలాలకు వెళ్లక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. కాలువ నిర్మాణానికి భూములు సేకరించిన సమయంలో ఫుట్‌పాత్ ఏర్పాటుపై అధికారులకు విన్నవిస్తే చేస్తామని హామీఇచ్చారని అంటున్నారు. ఇపుడు ఎవరికివారే తమకు పట్టనట్లు వ్యవహరించడంతో రైతులు ఇబ్బందులు పడక తప్పడం లేదనిరైతులు మారిశెట్టి అప్పారావు, మారిశెట్టి చిన్నతల్లి, మారిశెట్టి రమణ, మారిశెట్టి రాజారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చే ప్రభుత్వమైనా రైతుల కష్టాలను పట్టించుకుని పోలవరం కాలువపై ఫుట్‌పాత్ వంతెనను నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



తాళ్లపాలెం వద్ద పోలవరం వరదనీటి కాలువు

చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది



పోలవరం కాలువ నిర్మాణానికి ఇచ్చిన భూములుపోను, మిగిలినవి కాలువ అవతల ఉండిపోయాయి. నలుగురు అన్నదమ్ములకు చెందిన భూముల సాగుకు వెళ్లాలంటే, గొబ్బూరు వరకు వెళ్లి చుట్టూ తిరిగి రాక తప్పడం లేదు. అధికారులు స్పందించాలి. కాలువపై ఫుట్‌పాత్ వంతెన నిర్మించాలి

మారిశెట్టి నాయుడు,
రైతు , బంగారయ్యపేట

ఘనంగా పెద పైడితల్లమ్మ పండగ

ప్రజాశక్తి- కోటపాడు: మండలంలోని చౌడువాడ గ్రామంలో పెద్ద పైడితల్లమ్మ పండగ ఆదివారం ఊరు కట్టడితో ఘనంగా ప్రారంభమైంది. ఐదేళ్లకోసారి నిర్వహించే పెదపైడితల్లమ్మ పండుగలో భాగంగా సోమవారం సాయంత్రం 53 అడుగుల భారీ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సోమవారం నుండి మూడు రోజులు పాటు ప్రసిద్ధి చెందిన సురభి నాటకాలను జాతరలో భాగంగా గ్రామంలో ప్రదర్శించనున్నారు. సోమవారం తోలేళ్ల ఉత్సవం, బాణసంచా ప్రదర్శనలు, మంగళవారం రథం ఊరేగింపు, పండగ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు

'సహకార' ఎన్నికలు జరిగేదెన్నడో..?

-పదేళ్లు దాటినా పట్టించుకోని వైనం



కోటవురట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు గడిచిన పదేళ్లగా జరగక పోవడంతో సంఘ అభివృద్ధి కుంటుపడుతోంది. ఐదేళ్లకు ఒకసారి జరగాల్సిన ఎన్నికలు గత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు కో-ఆపరేటివ్ ఎన్నికలను దాటవేశాయి. 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 లో ఎన్నికలు జరగాల్సి ఉండగా జరపకుండా అనధికారిక కమిటీ సభ్యులను నియమించారు. సంఘానికి ముగ్గురు కమిటీ సభ్యులను నియమించి ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. గతంలో అధ్యక్షునిగా ఉన్న వ్యక్తినే నియమించారు.ఆ విధంగా కమిటీలతో కాలయాపన చేస్తున్నారు.

సహకార సంఘాల ఎన్నికల్లో డిసిసిబి సహ ఆప్కాబ్ ప్రమేయం కూడా ఉంటుంది. డిసిఎంఎస్, మార్క్ఫెడ్ పాలకవర్గాల సహా ఏఎంసీల పాత్ర కూడా ఉంటుంది. కేవలం రైతుల ఆజమాయిషీతో మాత్రమే నడిచే ఇంత ముఖ్యమైన సొసైటీకి ఎంతవరకు ఎన్నికలు జరగక పోవడం పట్ల పలువురు సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

25 గ్రామ పంచాయతీలకు సంఘంలో సుమారు గా 5000 మంది వరకు సభ్యులు ఉన్నారు. సభ్యుల వాటా ధనం సుమారు కోటి రూపాయల వరకు ఉంది. ,సంఘం నుంచి రైతులకు సుమారు 12 కోట్ల వరకు రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకుంటున్న రైతులు 2000 వరకు ఉంటారు. మీరు లక్ష రూపాయల రుణం తీసుకుంటే వారి వద్ద నుండి ఏడు శాతం వడ్డీ, లక్ష దాటితే మూడు శాతం వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చే వడ్డీ పై సబ్సిడీ సకాలంలో చెల్లిస్తే ప్రభుత్వం బరాయిస్తుంది. ఈ సంఘానికి ప్రతి యేటా 60 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఇక్కడ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన సంఘం సమావేశం సైతం మొక్కుబడి తంతుగానే జరుగుతోంది.

నాటి నుంచి నేటికీ ఎన్నికలు జరగక పోవడంతో ఆనాటి కమిటీ కొనసాగడంతో సంఘంలో ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇటీవల కాలంలో సంఘంలో భవనం మరమ్మతు నిమిత్తం మంజూరైన సొమ్ము, ఖర్చుల వివరాలు మాత్రమే కాదు ఇతరత్రా ఏ సమాచారం అడిగితే సమాధానం చెప్పడానికి కూడా కార్యదర్శి వెనకాడుతూ ఉండటం విశేషం. సంఘ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది నియమితులైన కమిటీ సభ్యులు తమ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు.

జిల్లాల విభజన అనంతరం ఎన్నికలు జరుగుతాయని అంతా భావించినా విభజన జరిగి ఏడాది దాటుతున్నా పట్టించుకోకపోవడం విశేషం. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించాలని సంఘంలో పలువురు సభ్యులు కోరుతున్నారు.

నిధులు పక్కదారి పట్టాయి

రాష్ట్రం విడిపోయిన తర్వాత సంఘం ఎన్నికలు జరపక పోవడంతో నిధులు పక్కదారి పట్టాయి. ఇష్టానుసారంగా సిబ్బందిని నియమించి నిధులను వృథాగా ఖర్చు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సమగ్ర విచారణ చేపట్టి, ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.



లాలం కాశీ నాయుడు, టిడిపి జిల్లా కార్యదర్శి

సమావేశాల నిర్వహణ ఏది?

గతంలో అధ్యక్షునిగా ఉన్న వ్యక్తినే కమిటీ ద్వారా అధ్యక్షునిగా నియమించి నిధులు వృథా చేయడంతో పాటు సొసైటీ కార్యాలయాన్ని పార్టీ కార్యాలయంలో వాడు కుంటున్నారు. సకాలంలో సమావేశాలు నిర్వహించక పోవడంతో నిధులు పక్కదారి పడుతున్నాయి.



సుంకర నూకి నాయుడు(బాబ్జి), పిఎసిఎస్ సభ్యులు

గ్రంథాలయాల్లో విజ్ఞానదాయక పోటీలు



నక్కపల్లిలో పద్య పఠనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కే.జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా ఆదివారం పద్య పఠనంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు చొప్పా సతీష్ పర్యవేక్షణలో పోటీలను నిర్వహించారు. విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ పలు పద్యాలను అవలీలగా ఆలపించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి పలువురు అభినందించారు. తెలుగు ఉపాధ్యాయులు సతీష్ పద్య పఠనంపై అవగాహన కల్పించారు. తెలుగులో పద్య పఠనం చేయడంతో మానసిక వికాసం కలగడమే కాకుండా, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో కట్టా హేమ, ద్వితీయ స్థానంలో రేష్మాంబిక, తృతీయ స్థానంలో గట్టెం పూజిత నిలిచారు. జేతలకు శిబిరం ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్దన్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నూకరాజు, సిబ్బంది రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులతో పలు ఆట పాటల పోటీలు నిర్వహించారు.విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ అధికారి మస్తాన్ పాల్గొన్నారు.



గొలుగొండలో..



అచ్యుతాపురంలో..


అచ్యుతాపురం : అచ్యుతాపురం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ఆదివారం విద్యార్థులకు నీతి కథలను అచ్యుతా ఇంగ్లీష్ మీడియం స్కూల్ఉపాధ్యాయురాలు మాధవి చెప్పారు. విద్యార్థులు వారికున్న పరిజ్ఞానంతో తమకు తెలిసిన నీతి కథలను తోటి విద్యార్థులకు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మన్యం ప్రాంత ప్రకృతి అందాలను తిలకించడానికి అరకులోయకు మైదాన ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. ఈ క్రమంలో మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. పర్యాటకులతో చాపరాయి జలపాతం కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. గార్డెన్లో ఫోటోలు తీసుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

ప్రిన్సిపల్ కుమారి



ప్రజాశక్తి -నక్కపల్లి:గురుకులంలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు గాను ఎస్సీ కేటగిరీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఈ మేరకు స్థానిక గురుకులం ప్రిన్సిపల్ కెఎస్ఆర్ కుమారి ఆదివారం స్పాట్ అడ్మిషన్లకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగులు సీట్లు భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు జరగనున్నాయని, ఎస్సీ కేటగిరీలో ఆసక్తి ఉన్నవారు ఈనెల 29న ఉదయం 9 గంటలకు తాళ్లపాలెం గురుకుల పాఠశాలకు ఆదాయ, కుల, ఆధార్ కార్డు ధ్రువీకరణ పత్రాలతో పాటు అవకాశం ఉంటే స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.ఈనెల 31న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగులు సీట్లు భర్తీ కోసం ఎస్సీ కేటగిరీలో (ఎంపీసీ)గాను మేఘాద్రి గెడ్డ గురుకుల పాఠశాలకు ఉదయం 9 గంటలకు ఆదాయ, కుల, ఆధార్ కార్డ్ ధ్రువీకరణ పత్రాలతో పాటు పదో తరగతి సర్టిఫికెట్ తో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని కోరారు.



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురం హైస్కూల్లో 1990-1991 సంవత్సరం బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు దారమఠం జలపాతం వద్ద ఆదివారం ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా ఒక చోటుకు చేరుకొని చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే సంవత్సరం డిఎల్.పురం లో ఫ్యామిలీ మెంబర్లతో ఏర్పాటు చేసుకుందామని పూర్వ విద్యార్థి బెన్నయ్య తెలపడంతో స్నేహితులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

రెల్లిలకు గుర్తింపు ఏదీ?

రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పాపారావు

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:రాష్ట్ర ప్రభుత్వం రెల్లి కులస్తులను గుర్తించకపోవడం దుర్మార్గమని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అన్నారు. ఆదివారం నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 30లక్షల మంది జనాభా ఉన్నా తమ కులస్తులను సరైన గుర్తింపు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ లెక్కల్లో లేకుంటే కుల సర్టిఫికెట్ ఎస్సీ రెల్లి అని ఎందుకు ఇస్తున్నారని, ఎస్సీ వర్గీకరణలో ఏబిసిడి రెల్లిలకు ఎలా కేటాయించారన్నారు. రెల్లి కార్పొరేషన్ ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రెల్లిలను గుర్తించి ప్రాధాన్యత కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ అధ్యక్షురాలు అరుణరాణి, త్రివేణి, ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాస్, అధ్యక్షులు ఋషి కుమార్, కార్యదర్శి బెనేసులు, వడ్డాది దేవుడు, స్వామి, వికాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాపారావు

గుణాత్మక విద్య అందించాలి

-మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.తలుపులు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గుణాత్మక విద్య అందించడమే ధ్యేయంగా పని చేయాలని నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారి సీహెచ్.తలుపులు తెలిపారు.



ఆయన ఆదివారం ప్రజాశక్తితో మాట్లాడుతూ, ఉపాధ్యాయులు బాధ్యతా యుతంగా అంకితభావంతో పని చేయాలని, సమయానికి స్కూలుకు చేరుకొని విద్యార్థులకు విద్యనందిస్తే మెరుగైన విద్యను అందించవచ్చని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు అవసరమని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ప్లే గ్రౌండ్ స్థలం తప్పని సరన్నారు. పాఠశాలకు సమీపంలోనే ప్లేగ్రౌండ్ ఉండాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్లే గ్రౌండ్ లేకపోయినా, సరైన మౌలిక సదుపాయాలు కల్పించక పోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక ఫీజులు వసూలు చేసినట్లు తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకు వస్తే తక్షణమే పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఫీజుల వివరాలు పాఠశాలలో ప్రదర్శించాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు, అంగడి పెట్టి అమ్మకాలు చేస్తున్నట్లు తమకు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామన్నారు. బడి బస్సుల భద్రతపై ట్రాన్స్ పోర్ట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, కండిషన్లో లేని బస్సులను రద్దు చేయాలని కోరారు.

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఆదివారం గణపతి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, శేషాచార్యులు, అప్పలాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి పంచామృత అభిషేకం నిర్వహించి, విశేష పూజలు జరిపారు. భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండల వాసులు ఆదివారం ఉక్క పోతతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఉదయం నుండి రాత్రి 8 గంటలు దాటినప్పటి కూడా ఉక్క పోత తగ్గక పోవడంతో జనం విలవిలల్లాడారు. బయటకు రాలేక ఇళ్లల్లో ఉండలేక తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు అల్లాడి పోయారు. తుఫాన్ ప్రభావం కారణంగా ఆకాశం మేగావృతమై ఉన్నప్పటికీ, ఎండ వేడిమికి, ఉక్క పోత తోడవడంతో విపరీతంగా చెమటలు పట్టి తడిసి ముద్దయ్యారు.

మోదకొండమ్మ పాదాల ఘాట్ కిటకిట

-వాహనాల రద్దీతో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు- వడ్డాది ఘాట్ రోడ్డు ప్రధాన రహదారిలో మినుములూరుకు సమీపంలోని మోదపల్లి పంచాయతీ పరిధిలో మోదకొండమ్మ పాదాల ఘాట్ కిటకిటలాడింది. ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని వెళ్లేందుకు భక్తులు అమ్మవారి పాదాల గుడి వద్ద బారులు తీరారు. మైదాన ప్రాంతాల నుంచి భక్తులు తమ కుటుంబాలతో కలిసి వాహనాల్లో భారీగా వచ్చారు. భక్తులతో పాదాల ప్రాంగణం నిండిపోయింది పాడేరు నుంచి విశాఖపట్నం ప్రధాన రహదారి కావడంతో పాదాల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచి పోవడంతో పాడేరు పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు.



నిలిచిన వాహనాలు

శిథిలావస్థలో జిసిసి గొడౌన్లు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవిపేటలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) భవనాలు శిథిలావస్థకు చేరాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ జీసీసీ గొడౌన్ నుంచి కొయ్యూరు మండలంలోని 53 డిఆర్ డిపోలు, 20 ఆశ్రమ పాఠశాలకు సుమారు 429 టన్నుల బియ్యం, పప్పులు, నూనె, ఉప్పు తదితర నిత్యావసర సరుకులు తరలిస్తుంటారు. ఇందుకోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సరుకులను ఈ గొడౌన్‌లో భద్రపర్చుతుంటారు. అనంతరం డిపోలకు వాహనాల ద్వారా సదరు సరుకులను సరఫరా చేస్తారు. దీంతో నిత్యం ఇక్కడ సందడిగా ఉంటుంది.

భవనం గోడలు ఎక్కడ కూలుతాయోనని ఇటు సిబ్బంది, అటు కళాసీలు, సరుకుతో వచ్చే వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని 1956లో నిర్మించారు. ప్రస్తుతం భవనం గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. వర్షాలకు పూర్తిగా కారిపోతుంది. దీంతో సరుకులు లోడింగ్, అన్ లోడింగ్ చేసేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.



శిథిలావస్థలో ఉన్న జిసిసి గొడౌన్ భవనాలు



బీటలు బారిన లోపల భాగం

ఇదిలా ఉండగా పనులు అనంతరం కార్మికులు కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు ఇప్పటికీ సరైన భవనం లేదు. తనిఖీలకు వచ్చే అధికారుల వద్ద వీరు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. గత్యంతరం లేక పెట్రోల్ బంక్ పక్కన ఉన్న జీసీసీకి చెందిన పాత భవనంలోనే సేదతీరుతున్నారు. ఇది పూర్తిగా శిథిలం కావడంతో నిరుపయోగంగా మారింది. కూలీలు అందులో ఉండే సమయంలో కూలితే పెను ప్రమాదం తప్పదని పలువరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీసీసీ ఉన్నతాధికారులు ఈ భవనం దుస్థితిపై తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న జిసిసి గొడౌన్ ముందు భాగం

పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మెరకచింత పంచాయతీ గసరపల్లి గ్రామంలో ఆదివారం పలువురు ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయా గ్రామాల పరిధిలోని అధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అభినందనలు తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అల్లూరి జిల్లా డిప్యూటీ డిఇఓ చెల్లయ్య, హుకుంపేట ఎస్సై సతీష్, ఉపాధ్యాయులు వలసనైని కొండలరావు, హుకుంపేట వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, ప్రధానోపాధ్యాయులు సీదరి సింహాచలం చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఇప్పటి నుంచి చదువుపై ఆసక్తి చూపించి ఆయా రంగంలో రాణించాలని సూచించారు. గ్రూప్ వన్, గ్రూప్ టు, సివిల్ సర్వీస్ వంటి ఉన్నత చదువుల్లో ఆసక్తి చూపించాలని, ఇందుకు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరగలుగుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ పద్మకుమారి, ఎంపీటీసీలు, యువకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ రెవెన్యూ భూమి

ప్రభుత్వ ఆదాయానికి గండి

-రెవెన్యూ భూమిలో మామిడి తోటకు నిర్వహించని వేలంపాట

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో పందూరు రెవెన్యూ పరిధిలో రామచంద్రపురం శివారు అల్లుముయ్యపాలెం వెళ్లే దారిలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న సర్వే నెంబర్: 23/3 ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలోని రెవెన్యూ భూమికి సంబంధించిన మామిడితోట గడిచిన నాలుగు సంవత్సరాలుగా వృథాగా ఉంది. గతంలో ఈ మామిడి తోటకు వేలంపాట నిర్వహించేవారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఈ మామిడి తోట ఫల సాయం వృథాగా పోతోంది. అధికారుల నిర్లక్ష్యంతో వేలంపాట నిర్వహించక పోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. సదరు భూమిపై వచ్చే ఫలసాయం వృథాగా పోతుండటం పట్ల పలు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి అన్యాక్రాంతం కాకముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే విలువైన ఈ భూమిని అధికారులు పట్టించుకోక పోవడంతో పలువురు విమర్శిస్తున్నారు.

ఈ విషయమై తహసిల్దార్ వెంకటరమణను వివరణ కోరగా రెవెన్యూ, సర్వే అధికారులతో విచారణ చేపట్టి స్వాధీనం చేసుకోవడంతో పాటు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు.